క్లుప్తంగా

దేవరపల్లిలో పారిశుధ్య పనులు



దేవరపల్లిలో రోడ్ల పక్కన చెత్తను తరలిస్తున్న దృశ్యం

దేవరపల్లి: దేవరపల్లిలో పారిశుధ్య పనులను ఆ గ్రామ పంచాయతీ ముమ్మరంగా చేట్టింది. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల పక్కనే గల చెత్త కుప్పలను జేసీబీలతో ఎత్తివేసి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ కడిమి వీర కుమారి శుక్రవారం పర్యవేక్షించారు. సూపర్ శానిటేషన్ కింద పంచాయతీ పరిధిలోని డ్రైన్లను, రోడ్లను శుభ్రం చేయనున్నట్టు సర్పంచ్ వీరకుమారి తెలిపారు.

రైతులకు భూ హక్కు పట్టాల పంపిణీ



రైతులకు భూ హక్కు పట్టాలు అందిస్తున్న ఎంపీపీ పోశిరాజు తదితరులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడు గ్రామంలో శుక్రవారం 20 మంది రైతులకు జగనన్న భూ హక్కు సురక్ష పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణల చేతుల మీదుగా రైతులకు వాటిని అందజేశారు. అనంతరం రావూరుపాడు ఒకటో వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతి, స్థానిక నాయకులు కొలిశెట్టి నాగేశ్వరరావు, దొరాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్స్ రూ.లక్ష బీమా



నిర్మాణ కార్మికునికి రూ. లక్ష బీమా బాండ్ అందిస్తున్న భారతి సిమెంట్స్ అధికారి

కొవ్వూరు: తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఉచిత బీమా సదుపాయం అందజేస్తున్నామని ఆ కంపెనీ అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ జి.రామమోహన్ ప్రకటించారు. భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కాపవరంలో తాపీ మేస్త్రీలతో అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో భారతి సిమెంట్‌ను తయారు చేశారని, భవన నిర్మాణాలకు అత్యంత శ్రేష్ఠమైనదని సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.భవానీశంకర్ అన్నారు. సమావేశంలో తాపీ మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష బీమా బాండ్లను అందజేశారు. లక్ష్మీ ట్రేడర్స్ యాజమాని బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాగిపాడు రోడ్డు నిర్మాణం చేపట్టాలి

గోపాలపురం: సాగిపాడు – గోపాలపురం రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల సమయంలో ఈ రోడ్డు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఆ పార్టీ నాయకుడు పోరండ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే తొమ్మిది గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళన

- పారదర్శకంగా జాబితా తయారీకి కసరత్తు
- నియోజకవర్గంలో పెరగనున్న ఓట్లు ఐదు వేలు
- అక్టోబర్ 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన
- మృతి చెందిన 1947 మంది ఓట్లు తొలగింపు



కొవ్వూరు: వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇప్పటికే జూలై 21 నుంచి ఆగస్టు 25 వరకూ నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) ఇంటింటికీ వెళ్లి సర్వే జరిపారు. కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 1,77,123 మంది ఓటర్లు ఉన్నారు. బీఎల్‌వోలు 78,053 ఇళ్లను సర్వే చేసి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సుమారు ఐదు వేల మంది ఓటర్లు కొత్తగా చేరనున్నారు. ఒకే డోర్ నంబర్‌తో పది కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్న 122 ఇళ్లను సర్వేలో గుర్తించారు. వాటిలో 1,522 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాలో ఉండగా, క్షేత్రస్థాయి పరిశీలనలో 975 మంది మాత్రమే ఉన్నట్టు బీఎల్‌వోలు నిర్ధారించారు. ఫారం–8 ద్వారా ఒకే డోర్ నంబర్‌తో ఉన్న 547 మంది వివరాల్లో మార్పులు చేశారు. నియోజకవర్గ మొత్తం ఓటర్లలో 1,947 మంది మృతులు ఉన్నట్టు గుర్తించి, వారిని ఓటరు జాబితా నుంచి తొలగించారు. శాశ్వత నివాసం ఉండని, వలస వెళ్లిన 909 మంది ఓట్లను గుర్తించి తొలగించారు. 224 డూప్లికేట్ ఓటర్లను గుర్తించి సరి చేశారు. 93 ఇళ్లకు డోర్ నంబర్లు లేనట్టు గుర్తించి సరి చేయించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ పర్యవేక్షణ కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. మూడు మండలాల తహసీల్దార్లు ఆయనకు సహాయ ఎన్నికల అధికారులు సహరిస్తున్నారు. ఈ సవరణ ప్రక్రియపై ప్రతి మంగళవారం ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్నారు.

రెండు చోట్ల కొత్తగా.. ఐదు చోట్ల బూత్‌ల మార్పు

నియోజకవర్గంలో కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. కొవ్వూరులోని పండిత మదన్‌మోహన్ మాలవ్య హైస్కూల్‌లోను, చాగల్లు మండలం మార్కొండపాడు ఎంపీపీ పాఠశాలలోను కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. తాళ్లపూడి మండలం తాడిపూడి ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉత్తర భాగంలోని భవనం పాడైపోవడంతో ప్రత్యామ్నాయంగా ఆ గ్రామంలోని సొసైటీ దక్షిణం వైపు గదిని పోలింగ్ బూత్‌కు కేటాయించారు. మలకపల్లిలోని 5,6,7 బ్లాకుల్లో మండల పరిషత్ ప్రైమరీ మెయిన్ స్కూల్లో దక్షిణ వైపు భవనం సక్రమంగా లేకపోవడంతో రైతు భరోసా కేంద్రం మెయిన్ హాల్లోకి పోలింగ్ బూత్‌ను మార్పు చేస్తారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం ఎంపీపీ మెయిన్ ప్రైమరీ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌ను గ్రామ సచివాలయ భవనంలోకి మారుస్తారు.

మిగిలిన షెడ్యూల్ ఇలా...

- ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ పోలింగ్ స్టేషన్ల సర్దుబాటు, విభజన చేస్తారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 1,500 ఓట్లు ఉండేలా చూస్తారు.
- ఎక్కువ, తక్కువ ఓటర్లు ఉంటే పోలింగ్ స్టేషన్లతో సర్దుబాటు చేస్తారు. గుర్తింపు కార్డుల్లోను, జాబితాలోను తప్పులుంటే సరి చేస్తారు.
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకూ 15 రోజుల పాటు ఫారం ఒకటి నుంచి 8 వరకూ పరిశీలిస్తారు. పెరిగిన, తగ్గిన ఓటర్ల జాబితాలు తయారు చేస్తారు.
- అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకూ ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తారు. రెండో ఆది, రెండు శనివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలోనప ప్రత్యేక ఓటర్ల నమోదు చేస్తారు.
- ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను, క్లెయిములను డిసెంబర్ 26 లోగా పూర్తి చేస్తారు.
- 2024 జనవరి ఒకటో తేదీన తయారైన ఓటర్ల జాబితాను ఆమోదానికి పంపిస్తారు.
- 2024 జనవరి ఐదో తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తారు.

కొవ్వూరు నియోజకవర్గం

ప్రస్తుతం ఉన్న మొత్తం పోలింగ్ బూత్‌ల సంఖ్య	174
సర్వే ద్వారా నియోజకవర్గంలో పెరగనున్న బూత్‌ల సంఖ్య	2
పోలింగ్ కేంద్రాల భవనాల మార్పుకు ప్రతిపాదించినవి	05
ఇప్పటి వరకు అందిన ఫారం-6లు	3,720
ఫారం-7 దరఖాస్తులు	2,965
ఫారం-8 దరఖాస్తులు	8,211

పారదర్శకమైన జాబితా తయారీ



అత్యంత హేతుబద్ధంగా ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షలు జరిపి లోపాలుంటే సరి చేస్తున్నాం. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అక్టోబర్ 17న ప్రదర్శిస్తాం. ఓటర్లందరూ ఆ జాబితాలో పరిశీలించుకుని తమ ఓట్లలో లోపాలు ఉంటే సరి చేయించుకోవాలి. –ఎస్.మల్లిబాబు, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి, కొవ్వూరు

నిర్మించుకున్న ఇళ్లకు నిధులివ్వండి



అసెంబ్లీ హాల్లో సీఎం జగన్‌కు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని పేదలు కట్టుకున్న గృహాలకు నిధులు మంజూరు చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. శుక్రవారం అసెంబ్లీ హాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన కలిసి నియోజకవర్గంలో జగనన్న లే అవుట్లు, సొంత స్థలాలు కలిగి డీపీఆర్ చేసిన లబ్ధిదారులకు గృహాల మంజూరు, గతంలో కట్టుకున్న గృహాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి సీఎం జగన్ సానుకూలంగా స్పందించి, అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఎమ్మెల్యే వెంకట్రావు తెలిపారు.

వాహనాల వేలం ద్వారా రూ.1.16 లక్షల ఆదాయం

దేవరపల్లి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) దేవరపల్లి స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో రూ.1,16,520 ఆదాయం వచ్చినట్టు సీఐ డి. సుధ తెలిపారు. అనంతరం వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 248 కిలోల బెల్లాన్ని ధ్వంసం చేసినట్టు ఆమె తెలిపారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు 48 మంది ఎంపిక

తాళ్లపూడి: కొవ్వూరు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీలను శుక్రవారం మండలంలోని గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. అండర్ –14, –17 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా సాగాయి. తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనబరిచిన మొత్తం 48 మందిని ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాని ఆయన చెప్పారు. ఈ క్రీడా పోటీల్లో వ్యాయామో పాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి డి.రాజేంద్రప్రసాద్, కో–ఆర్డినేటర్ సీహెచ్ సతీష్, , మూడు మండలాల వ్యాయమోపాధ్యాయులు రామచల్లయ్య, లెనిన్‌బాబు, జె. పండు, లక్ష్మణ్, లక్ష్మీదుర్గ, సౌజన్య, కృష్ణకుమారి, దుర్గ పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన శెట్టిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి పోటీలకు శెట్టిపేట విద్యార్థులు ఎంపిక

నిడదవోలు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21 వరకూ నిడదవోలులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపిన శెట్టిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీవీ రవికుమార్ శుక్రవారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, అథ్లెటిక్స్‌లలో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఎంపికై న తమ విద్యార్థులు జిల్లా పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పీడీ పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కొవ్వూరు నియోజకవర్గ బాలురు, బాలికలు

నేడు దేవరపల్లిలో బాలికల ఆటల పోటీలు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ స్థాయి అండర్– 14, అండర్–17 బాలికల స్కూల్ గేమ్స్ పోటీలను శనివారం దేవరపల్లి ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు ఆ హైస్కూల్ పీడీ ఓరుగంటి నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలను శనివారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, టెన్నికాయిట్, యోగా, షటిల్, బాల్‌బాడ్మింటన్ వంటి వంటి విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- పట్టణంలో సర్వే తీరు పరిశీలన

నిడదవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సూచించారు. పట్టణంలోని ఎస్టీ, వైఎస్సార్ కాలనీలు, బాలాజీ, బాపూజీ నగర్‌లలో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం కమిషనర్ కేవీ పద్మావతి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.హేనాలతో కలిసి చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. కమిషనర్ కేవీ పద్మావతి మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో గుర్తించిన ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అక్టోబర్ 4న నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.హేనా మాట్లాడుతూ సర్వే సందర్భంగా ప్రతి ఇంటిలోని వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. వైద్య శిబిరం నిర్వహించే తేదీని, సమయాన్ని ముందుగానే తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న చైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ పద్మావతి

చాగల్లు: మండలంలో నందిగంపాడు, దారవరం గ్రామాల్లో వైద్య సిబ్బంది, వలంటీర్లు శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు.తొలుత ఆయా గ్రామాల్లో సర్పంచులు కుదప రాంబాబు, మద్దుకూరి రవిప్రసాద్ సర్వేలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించారు. అనారోగ్య సమస్యలతో ఉన్న వారి వివరాలను నమోదు చేసుకుని, సచివాలయాల వద్ద త్వరలో నిర్వహించే మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

తాళ్లపూడి: ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలని, విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు హెచ్చరించారు. మండలంలోని పోలింగ్ బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌వో)లతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు ఆర్డీవో మల్లిబాబు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాల నుంచి డూప్లికేట్ ఎంట్రీలను తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు, డోర్ నంబర్ల పరిశీలన

నల్లజర్ల: నల్లజర్ల గ్రామంలోని 171,176 పోలింగ్ కేంద్రాల్లో డోర్ నంబర్లు, సెక్షన్లు వరుస క్రమంలో ఉండాలన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూచన మేరకు శుక్రవారం తహసీల్దార్ కిశోర్‌కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రాజకీయ పార్టీల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కారుమంచి రమేష్ లేవనెత్తిన అంశంపై తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పరిశీలన జరిపారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయా రాజకీయ పార్టీల నేతలు చేసిన సూచనలు, సలహాలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున కారుమంచి రమేష్, టీడీపీ నుంచి గుదే వెంకట సుబ్బారావు, నిమ్మలపూడి ప్రసాద్, జనసేన తరఫున ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు ,రుద్రా శ్రీనివాస్ హాజరయ్యారు.



తాళ్లపూడిలో బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి



కానూరులో ఈ క్రాప్ చేసిన వరి పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

నల్లజర్ల: పీఎం కిసాన్ యోజన ద్వారా ఆర్థిక లబ్ధి పొందాలంటే రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 15వ విడత పీఎం కిసాన్ యోజన వచ్చే నెలలో అమలు కానున్న దృష్ట్యా రైతులందరూ తమ సమీప రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులను కలుసుకుని ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో ఇప్పటికీ 283 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇలా మిగిలిపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు చెప్పారు.

ఈ క్రాప్ చేయించుకోవాలి

పంటలు వేసిన రైతులంతా ఈ–పంట నమోదు చేయించుకోవాలి. ఇలా చేయించుకోకపోతే ధాన్యం అమ్మే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఏవో కమల్‌రాజ్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంటల పొందడం కూడా వీలు కాదన్నారు. మండలంలో 8,566 ఎకరాలలో వరి పంట వేస్తే ఇంతవరకు 7 వేల ఎకరాలలో మాత్రమే పంట నమోదైందన్నారు. ఈనెలాఖరు లోగా ఈ–పంట నమోదు గడువు ముగుస్తుందన్నారు.

రైతుల మేలు కోసమే ఈ క్రాప్ నమోదు

పెరవలి: తాము సాగు చేసిన పంటలను రైతులు విధిగా ఈ క్రాప్ చేయించుకోవాలని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని కానూరు గ్రామంలో ఈ క్రాప్ చేసిన పంట భూములను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 33 వేల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఇందులో ఎంతెంత విస్తీర్ణంలో రైతులు ఏయే రకం పంటలు వేశారో తెలిస్తే, వారికి అవసరమైన ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం ద్వారా అందించేందుకు ఈ క్రాప్ ఉపకస్తుందన్నారు. అలాగే రైతులు పంటల బీమా సాయం , రైతు భరోసా సాయం పొందాలన్నా ఈక్రాప్ తప్పని సరి అన్నారు. ప్రస్తుతం మండలంలోని 18 గ్రామాల్లో 90 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. రెండు రోజుల్లో మొత్తం పూర్తవుతుందన్నారు.

సీ పెట్‌లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నల్లజర్ల: విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ (భారత ప్రభుత్వం) ఆధ్వర్యంలో ఓబీసీ, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాన్ని అందిస్తోందని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ బీసీ, ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థల సౌజన్యంతో టెన్త్ ఉత్తీర్ణులైన 18–35 మధ్య వయసు నిరుద్యోగులకు పాలిమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సుల్లో 3 నుంచి 6 నెలల పాటు శిక్షణ ఇస్తారు. అనంతరం సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, హైదరాబాదు, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థలలో ఉద్యోగావకాశం కల్పిస్తామని శేఖర్ వివరించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యంతో పాటు ట్రైనింగ్ కిట్, యూనిఫాం, సేఫ్టీ షూస్ సీ పెట్ సంస్థ అందిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత, కులం ,ఆదాయ ధ్రువ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు సీపెట్ సంస్థ ప్రతినిధి కె.సుందర్రావుకు అందించాలన్నారు.మరిన్ని వివరాలకు 93980 505255 అనే సెల్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

కంసాలిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

నిడదవోలు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వైద్యాధికారి వై.జానకీప్రియ అన్నారు. మండలంలోని కంసాలిపాలెంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జానకీప్రియ రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.జోసెఫ్, ఎంఎల్‌హెచ్‌పీ బి.పద్మ, ఏఎన్ఎం కె.శేషుకుమారి, హెల్త్ అసిస్టెంట్ పి.విజయబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో ఘనంగా కుంకుమ పూజలు



తాడిపర్రులో వీపునకు ధరించిన శూలంతో శివుని వాహనం లాగుతున్న భక్తుడు



కొవ్వూరు మెరక వీధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు



చాగల్లులో వినాయకుని ఆలయంలో జిల్లా ఎస్పీజగదీష్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

కొవ్వూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెరక వీధి వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి శిబిరంలో శుక్రవారం లక్ష్మీదేవి, దుర్గాదేవిలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వందలాది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. పండితుడు పాలవంచ వెంకట రమణాచార్యులు లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. సహస్ర నామం, దుర్గాదేవి అష్టోత్తరం పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు ఆవుల శ్రీనివాస్, అత్తిలి పండు, గడదాసి శివ, ముత్యాల సాయి తదితరులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిడదవోలు: పట్టణంలోని యాదవుల వీధిలో 9వ గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మండపంలోని గణనాథుని సన్నిధిలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, గోపి యాదవ్, గుడ్ల సతీష్, ఘంటా సావిత్రి, కట్టా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో గరిక పూజ

ఉండ్రాజవరం: బ్రహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సహస్ర నామ గరికలతో గణపతికి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో దోనేపూడి సుధాకర్, ఆకెళ్ల శ్రీనివాసు, ఈ.సత్యకృష్ణ, కె.గోపాలకృష్ణమూర్తి, డి.శ్రీరామ్‌పవన్, కె.సత్యనారాయణ, వైవిఆర్‌కె.మూర్తి, వై.భాస్కరరావు, రాపర్తి వెంకటరామయ్య పాల్గొన్నారు. అలాగే తాడిపర్రులో కరికాల బత్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. భక్తుడు వీపునకు శూలాలు ధరించి వాటి సహాయంతో శివుని వాహనాన్ని లాగుతున్న దృశ్యం పలువురిని ఆకట్టుకుంది.

చాగల్లు: స్థానిక తెలగా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగా సంఘం కమిటీ సభ్యులు ఏటా ఎంతో ఘనంగా గణపతి నవరాత్ర వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, ఆ పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు తదితరులు పాల్గొన్నారు. కాగా తెలగా సంఘం కళావేదిక వద్ద రాక్ స్టార్ ఆర్కెస్ట్రా వారు గురువారం రాత్రి సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు పలు హుషారైన పాటలతో ప్రేక్షకులను అలరించారు. అలాగే వర్తక సంఘం కళావేదికపై బాలనాగమ్మ నాటకాన్ని ప్రదర్శించారు. కాగా చాగల్లు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు సందడిగా జరిగాయి.